# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కష్టాలపాలవుతాం..



నృత్యం చేస్తున్న హన్మంత్‌షిండే

- నేను మీ నియోజకవర్గ బిడ్డను..
- ఆశీర్వదించి గెలిపించండి..
- ఎమ్మెల్యే హన్మంత్‌షిండే
- జుక్కల్ మండలంలో జోరుగా ఎన్నికల ప్రచారం
- అడుగడుగునా ఘన స్వాగతం
- విజయం మీదేనంటూ మహిళల మంగళ హారతులు



డోన్‌గావ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నిజాంసాగర్, నవంబర్ 11: 'మీ నియోజకవర్గ బిడ్డను.. ఆశీర్వదించి గెలిపించండి..' అంటూ జుక్కల్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్‌షిండే ఓటర్లను అభ్యర్థించారు. జుక్కల్ మండలంలోని సావర్‌గావ్, వజ్రఖండి, సోపూర్, మధుర తండా, డోన్‌గావ్, దోస్తపల్లి, బంగారుపల్లి, మైబాపూర్, గుండూరు, జుక్కల్ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రచారానికి వెళ్లిన ఆయనకు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు తిలకం పెట్టి మళ్లీ విజయం సాధిస్తారని, నాలుగో సారి ఎమ్మెల్యేగా గెలుపొందుతారంటూ ఆశీర్వదించారు. అనంతరం షిండే మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు వలస నాయకులన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలపాలవుతామని అన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని గుర్తించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటిసారి అధికారం చేపట్టాక పింఛన్‌ను పెంచిందని, రెండో సారి రెట్టింపు చేసిందని, ఇప్పుడు అధికారంలోకి వస్తే దశల వారీగా పెంచుతుందని తెలిపారు. రైతుబంధును కూడా దశలవారీగా ఎకరానికి 16వేలకు పెంచి అందజేస్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే మార్చి నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం సరఫరా చేయడానికి సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని గుర్తు చేశారు. నాగమడుగు మత్తడి నిర్మాణం పూర్తయితే నియోజకవర్గం మొత్తం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. గడిచిన 65 ఏండ్లలో జరగని అభివృద్ధి పనులు కేవలం పదేండ్లలోనే చేశామని చెప్పారు. విద్య, వైద్యం తదితర అన్ని రంగాల్లో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. నాయకులు నీలూపటేల్, సాయాగౌడ్, శివానంద్, మాధవ్‌రావ్‌దేశాయ్, బొల్లి గంగాధర్, పెద్దకొడప్‌గల్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



వంట చేస్తున్న మహిళను ఓటు అడుగుతున్న నాయకులు



తండాలోని గిరిజన ఇంట్లో రొట్టె తింటున్న ఎమ్మెల్యే షిండే



ఎమ్మెల్యే హన్మంత్ షిండేకు బొట్టు పెడుతున్న మహిళలు

# అభివృద్ధి చేశా.. మరోసారి ఆశీర్వదించండి

**• బీఆర్‌ఎస్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్ • గౌరారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు**



ఆలయంలో పూజలు చేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

గాంధారి, నవంబర్ 11: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎప్పుడూ జరగని అభివృద్ధి పనులు ఐదేండ్లలో పూర్తి చేశానని, మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం గాంధారి మండలంలోని గౌరారం హనుమాన్ ఆలయంలో జాజాల సురేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆసరా పింఛన్లతోపాటు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, కంటి వెలుగు తదితర ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న గాంధారిలోని రోడ్డు విస్తరణ పనులతోపాటు కామారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారిపై పొతంగల్ కలాన్ నుంచి చందానాయక్ తండా వరకు రోడ్డు విస్తరణ పనులు, గుడిమేట్ నుంచి కరక్‌వాడి మీదుగా సోమ్లానాయక్‌తండా వరకు రోడ్డు పనులను పూర్తి చేయించినట్లు తెలిపారు. కేసీఆర్ మ్యానిఫెస్టోలోని ప్రతి అంశాన్ని తప్పకుండా అమలు చేస్తారని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గాంధారి మండలాధ్యక్షుడు శివాజీరావు, జడ్పీటీసీ శంకర్‌నాయక్, ఎంపీపీ రాధాబలరాం, గాంధారి, గౌరారం, గండివేట్ సర్పంచులు మమ్మాయి సంజీవ్, అంజయ్య, అబ్దుల్ ఫారూక్, ముదెల్లి విండో చైర్మన్ సాయిరాం, ఎంపీటీసీ ఉమరాణి అంజయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ముకుంద్‌రావు, సీతాయిపల్లి శ్రీను, శ్రీకాంత్‌రెడ్డి, గంగాధర్‌తోపాటు మండలంలోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం సభాస్థలి పరిశీలన



సోమారిపేటలో సభా స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 15న సీఎం కేసీఆర్ ఎల్లారెడ్డికి వస్తున్నారు. ఇందుకోసం సభా స్థలాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ శనివారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. సోమారిపేట రోడ్డులో ఉన్న సాయినగర్ ప్రాంతాన్ని సభ కోసం ఎంపిక చేశారు. అక్కడ తగిన ఏర్పాట్లు చేయాలని నాయకులను ఆదేశించారు. 2014, 2018 ఎన్నికల సమయంలో కేసీఆర్ బహిరంగ సభను ఇదే ప్రాంతంలో నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. హెలిప్యాడ్‌ను పట్టణంలోని బస్‌డిపో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్, ఆర్‌అండ్‌బీ డీఈఈ నారాయణ, ఏఈ శ్రీకాంత్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌లోకి చేరికలు



పిట్లం, నవంబర్ 11: పిట్లం మండలంలోని తిమ్మానగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు బోర్‌వెల్ సంతోష్‌రెడ్డి శనివారం ఎమ్మెల్యే హన్మంత్‌షిండే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో హన్మంత్‌షిండే చేసిన అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు విజయ్, దేవేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్రీఖర్‌రెడ్డి, పండరి, జయ విఠల్, శపథంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.